

హేమంతం. మల్లె పూలని కోసి తన ఎర్రని ఒడిలో వేసుకున్న స్త్రీలా ఉంది ఉషస్సు, మాయమయిన చుక్కలతో.

గుడిసెలో అలిసిన నాగరత్నం కళ్ళ రెప్పలు టప్పున విడ్డాయి—పిట్టల సందడికి కాదు, దూరంగా మోగిన కారు హారన్ వినబడి. పక్కలో సుబ్బన్న పడుకుని వున్నాడు. రెండేళ్ళు ఉంటాయి వాడికి. గూటిలో దీపపువెలుగు వాడి ముఖం మీద పడుతోంది. రాత్రల్లా ఒకటే ఏడుపు. భుజం మీద పడుకోబెట్టుకుని తిప్పలేక విసిగి పోయింది. నాగరత్నం ప్రాణం కాని ఇప్పుడు వాడి ముఖం చూస్తే ఆమె మనస్సుకరిగి పోయింది. నోరులేని పసికూన. కాలుబాధ చెప్పుకోలేడుగదా. వాడిని ముద్దుపెట్టుకోవాలనిపించి, లేపుతాననేభయంతో నిగ్రహించుకుంది నాగరత్నం. సంధ్యాకాశం కింది దూరపు తోటల్లా ఉన్నాయి వాడి రెప్పల అంచులు—అదే అలసట, అందం, అమాయకత్వం.

'ఆలోసిత్తూ కూకుంటే కారు దాటిపోద్ది. కనుక్కున్నోడయితేనేం? ఆడికి ఈనలుసంటే పిసరంత ఆశా అభిమానం ఉంటేగా?' అనుకుంటూ లేచి కోక సవరించుకుంది. సుబ్బన్నని భుజంమీద పడుకోబెట్టుకుని తనకొంగు వాడికి దగ్గరగా కప్పింది.

'అమ్మోయ్, ఎళతన్నా? అంది నాగరత్నం కుక్కనులక మంచంలో ఉతుకుకి వేసిన వూరి వాళ గుడ్డల్లో వెచ్చగా మునిగివున్న తల్లితో.

ముసలిది 'పూ: బేగిరా. టీసుక్క కావాలి' అంది పూర్తిగా మేలుకోకుండానే.

తడికె చేరవేసి బయటికి వచ్చింది నాగరత్నం.

కాలవ అవతలరోడ్డుమీద బస్సువెళ్ళిపోతోంది.

'ఓ...య్ బావో...య్! కారాపూ...' అని దీర్ఘంతో కేకవేసి కాలవకి అడ్డంగా ఉన్నతాడి మీద జాగర్తగా పరిగెట్టింది నాగరత్నం.

పెంటయ్య బ్రేకు వేశాడు. ఇంజన్ పోటుకు కప్పల్లా రొద చేస్తోంది.

కాకీ దుస్తుల్లో స్టీరింగ్ ముందు కూర్చున్న పెంటయ్య మంచి బలిష్ఠుడు—కనీసం నిన్న మొన్నటివరకయినా తలకి మఫ్లరు చుట్టుకున్నాడు. చేతులమీద నీలంగా, దేశపటంలో గుర్తించిన నది ఉపనదులలా, నరాలు పొంగాయి. మేకుల్లాంటి కనుబొమల కింద ఎర్రని కళ్ళు అతనికి హృదయం లేదేమో అని తోపిస్తాయి.

ఇతనే నాగరత్నం ఉద్దేశించిన 'కనుక్కున్నోడు' —సుబ్బన్న తండ్రి.

నాగరత్నం కూచోగానే బస్సు సాగిపోయింది. ఈ పడుచుపిల్ల రాకతో రెండోసీట్లో వున్న జీకిందువా పెద్దమనుషుల్లో కొంచెం జీవం ప్రవేశించింది.

నాగరత్నం పక్క నోటిసుడికి కొంగు లాగుకుని కూచున్న కాపులామె 'అబ్బ చలి ఎముకలు కొరికేస్తావుంది. ఈపోసనేంటబ్బా!' అంది ముక్కుమూసుకుంటూ?

# ఆమాయమూలి



ద్విభాష్యం నరసింగరావు

నేరం ఒప్పుకుంటున్న దొంగలా నాగరత్నం 'పిల్లోడి కాలు కురుపవమ్మా—పురుగుపొంగంట?' అంది సుబ్బన్నకాలు కొంచెం చూపిస్తూ.

ఆ కాలు చూసి జాలితో భయపడిన ఆ స్త్రీ ముక్కుమూసుకోడం మరిచి 'అయ్యో అలా కుళ్ళ బెట్టేశావేం అమ్మా కాలుని?'అంది.

పట్నవాసం మాది. ఇలాటి వెరగం. గచ్చాకు పుచ్చాకు వయిజ్జుం దగ్గర్నుంచి గవర్నమెంటు డాక టేరుదాకా శౌనా సూశాం తగ్గనేదు. మొన్నెవరో పున్నెం కట్టుకుని సెప్పారు—ఈ దగ్గర్లో సాధువుగోరున్నారనీ, ఆరు మూడు మంతరాలేస్తే మాయమయి పోద్దని....'

తరువాత ఆ కాపు పడుచు నాగరత్నానికి ఎందరు పిల్లలో అడిగింది. ఇంకా 'బగమంతుడు' ఆమెకి పిల్లల్ని ఇవ్వలేదని వినగానే ఆ స్త్రీ కుతూహలం హద్దులేకుండా పెరిగిపోయింది. డొంకంతా కదిలింది.

నాగరత్నం మొగుడు చాలాకాలం కిందటే మనువు వదులుకొని రంగం వెళ్ళిపోయాడు. తనరెక్కమీదే ముసలి తల్లిని కూచోబెట్టి మేపుతూ పట్నంలోనే ఉండిపోయింది నాగరత్నం. అంతా ఆరు నెలల క్రితం తానీవూరు వచ్చింది—తన అప్పసోయేముందు. వీడు అప్పకొడుకే. తనకి అప్పగించి తన మీద ఎన్నో ఆశలతో కళ్ళు మూసింది అప్ప.

'ఈకారు నడిపేది మా బావే, అంది గర్వంగా నాగరత్నం.

మరి ఇతగాణ్ణే కట్టుకోరాదూ?' అంది ఆ స్త్రీ ఆది అతిసహజంగా జరగవలసిన పనిలా.

సిగ్గుపడి నవ్వింది నాగరత్నం. ఆనవ్వులో ఎవరికీ అర్థంకాని దిగులు దాగి ఉంది.

బస్సు ఆగింది.

తన రెండు నిమిషాల స్నేహితురాలుతో 'ఎళ్లొస్తానమ్మా,' అని చెప్పి దిగిపోయింది నాగరత్నం.

బస్సు సాగిపోయింది. పెంటయ్య వెనక్కి చూడడు.

చేల గట్లంట నడుస్తోంది. కోతకొచ్చి ఒరిగిన చేలు పసుపుచీరలు ఆరవేసినట్టు ఉన్నాయి. దూరపుచెట్లు మంచులో చదునయిపోయి నీలంగా కనిపిస్తున్నాయి.

సాధువు కుటీరం చేరుకుంది.

ఇంకా కాలవలో స్నానం చేస్తూ ఉత్సాహంగా ఇటూ అటూ చూస్తున్నాడు సాధువు. నల్లటి గడ్డం అతనికెంతో అందంగా ఉంది. ఉపవాసాల, నియమాలకాంతి దబ్బపండులాంటి దేహచ్ఛాయలో ప్రస్ఫుటమవుతోంది.

నాగరత్నం తెలివైనది. గతరెండు రోజులుగా ఇతనిలో ఏదో మార్పు గుర్తించింది. ఆమొదటి మూడురోజులూ తానెంత వేగంగా వచ్చినా స్నానం, ధ్యానం అన్నీపూర్తి చేసుకుని స్మితంగా కూర్చునేవాడు అప్పటికే. కాని నిన్నా యివాళా ఎందుకో మరి తాత్సారం చేస్తున్నాడు.

'వచ్చావా నాగరత్నం? పైన చూడు చంద్ర వంక నీలంగా ఎంతబావుందో! దానివక్క మరోటి వుంటే ఆదృశ్యం నీ అరమోడ్పు కన్నుల్లా ఉండేది గదూ? అన్నాడు సాధువు.

ఉలికిపడింది నాగరత్నం. నిన్న కళ్ళుమూసుకుని శ్లోకాలు చదువుకుంటున్నాడీయన.

సౌందర్యాన్ని చూడడం, భావన చేయడంతో మొదలవుతుంది సన్యాసి పతనం అనే మూగభావం కదిలింది నాగరత్నంలో.

ఇన్నాళ్ళయినా సుబ్బన్నకిపూర్తిగా తగ్గ ముఖం పట్టకపోడం ఆమె అనుమానానికి బలాన్నిస్తోంది. సాధువుకంటబడిన తెగులల్లా ఇట్టే ఎగిరాపోతుం దని తమ అనుభవాలని ఏకరువు పెడుతూ ఉంటారు మరి వూరంతా.

సాధువు వేసిన పెసలని జంటపావురాలు—ఒకటి తెల్లటిదీ, అందమైన మచ్చలదింకొకటీ—ఏరుకుంటున్నాయి.

దూరంగా ఒక కుక్క తోకాడిస్తూ తిరుగుతోంది. ఆ నీచజంతువు దగ్గరికి రాకుండా కట్టడి చేశాడు సాధువు. అతని భూతదయలో భాగం దానికి పరోక్షంగానే అందుతుంది.

ఒక ఆశ్రమవాసి ఆకులో ఏదో పట్టుగెళ్లి దానిముందు విసిరాడు. సాధువు కుటీరానికి దూరంగా పాకలలో ఇలాటి భక్తులున్నారు. సాధువుకి పరిచర్యలు చెయ్యడం, ఆయన దర్శనం కోసం వచ్చేవారికి సదుపాయాలు చూడడం వారి పనులు.

ఒక పరగుడు పాము చెట్లలోకి మాయమైంది.

హడలిపోయింది. నాగరత్నం.

'పర్వాలేదు. మన ఆశ్రమ సమీపంలో ఎలాటి జంతువయినా సాధువే!'అన్నాడు నవ్వుతూ సాధువు.

అప్పుడాయన కళ్ళలో సాత్విక భావంగాక, మామ తన పిల్లతో గొప్పలు చెప్పుకొనేటప్పటి వెలుగుని చూసింది. నాగరత్నం.

'ఇంకా ఎన్నిమంతరాలు పడాలి బాబూ'?

సాధువు సంశయంగా చూశాడు నాగరత్నం వైపు. ఆమె ప్రశ్నలో తల్లికుండే ఆదుర్దా తప్ప యింకేమీ లేదని రూఢి చేసుకున్నాక కొంతకాలం పడుతుంది మరి. ముదిరి పోయింది' అన్నాడు.

మంత్రం వేస్తున్నంతసేపు సాధువువైపు పరిశీలనగా చూసింది నాగరత్నం, మునపటి నెమ్మది లేదక్కడ. తనని తనే తిట్టుకుంటున్నాడా అనిపించిందామెకి.

సెలవు తీసుకు చాలాదూరం వచ్చేశాక వెనక్కి పిలిచాడు సాధువు.

దగ్గరికి వెళ్ళింది.

తల వూపి వచ్చేసింది నాగరత్నం.

'ఆశని ఎగసన దోశాడీయన. నాబాబెప్పటి కయినా మళ్ళా హాయిగా ఆడుకుంటాడా?' అని నిట్టూర్చింది. ఇంకా మాటలురాక పోయినా సంజ్ఞతో వాడు ఆడే వూసులన్నీ తలుచుకుంటోంది.

దూరంగా రంగడు కనబడ్డాడు.

వాడిని చూస్తే నాగరత్నానికి అసహ్యం. బనీనూ, ఎగగట్టిన పంచె, బుట్టతలా, మీసాలూ వాడూను.

ఒదిగి నడుస్తోంది.

వాడేమీ ఎరగనట్టు వచ్చి రాసుకుపోయేడు.

సుబ్బన్న కురుపురేగి కెవ్వుమన్నాడు.

'ఏదవ సచ్చినాడా! కళ్ళు మూసుకు పోనాయంట్రా?' అని తిట్టుకుంది. ఎక్కువగా తిట్ట డానికి కూడా నోరురానంత దుఃఖం కలిగించామెకి.

పిల్లడిని గట్టిగా గుండెలకదుముకుని తలమీద తట్టుతూ, 'నాబాబే, నేసచ్చిపోయానే....' అంటోంది.

అంతకన్న ఏం చెయ్య గలదు? లేస్తున్న సూర్యుడే కోపాన్ని తగ్గించుకుంటున్నాడు.

ఆమెలో మానవతీ మాతృమూర్తి ఒకరిని మించి ఒకరు ఆక్రోశిస్తున్నారు.

2

మధ్యాహ్నం. తాసిల్దారుగారింటి వాయిల్ చీర కట్టుకుని, నున్నగా తలదువ్వుకుని, కానీ అంత బొట్టుపెట్టుకుంది నాగరత్నం. బస్సు వస్తుంటే చంకన బట్టల మూటతో ఒక చేతిలో కారియర్‌తో రోడ్డుమీదికి వెళ్ళి ఎక్కింది.

ఏడుమైళ్ళు ప్రయాణించి రేవు చేరుకుంది బస్సు. మళ్ళీ గంటదాకా బయలుదేరదు.

పెంటయ్య నదిలో కాళ్ళూ చేతులూ ముఖం కడుగుకుని వచ్చాడు. మునుపు లేదీ అలవాటు. నాగరత్నం చేసింది.

రావిచెట్టు శుభ్రమైన ఇసుక నేలలో విస్తరి పరిచి అన్నం వడ్డించింది నాగరత్నం. ఆకులు సంగీత కచేరీలో హర్షధ్వానాల్లా ఒకటే గలగల.

ఎవరో వెంట తరుము తున్నట్టు తింటున్నాడు పెంటయ్య.

'కూంత నెమ్మదిగా తినరాదూ?' అని ప్రేమగా కసురుతుంది నాగరత్నం.

'టైమయి పోతాది మరి, తింటుకాచుంటే.'

'ఏదవ టైము! ఆబస్సుకి బానిసవై పోనావ్! మనపని సేసుగుంటే కడుపులో సల్ల కదలకుండా, వుండొచ్చు''అని నిట్టూరుస్తుంది నాగరత్నం.

ఆమెకి తెలుసు పెంటయ్య చరిత్ర.

పెంటయ్యకి ముందు పుట్టినవాళ్లెవరూ దక్కలేదు. భయంచేసి తల్లిదండ్రులితను పుట్టగానే పెంటమీద పడేసి బతికిన తరువాత ఈ చెత్తపేరు పెట్టారు.

పెంటయ్య తండ్రికి చాకలిపనంటే ఇష్టం లేకపోయినా తప్పలేదు. పగలల్లా రెక్కలు ముక్కలు చేసుకుని రాత్రి తాగొచ్చి భార్యబిడ్డల హూనం చేసేవాడు. అది మట్టి అయిపోగానే తెలిసివచ్చింది అతనికి ఆమెలేని లోటు.

కొడుకుని మొదటినుంచీచదువులో పెట్టాడు. కాని పెంటయ్యకి ఎక్కువ అబ్బలేదు. మోటారు నడపడం నేర్చుకుని నెలకింత జీతం సంపాదిస్తున్నానని అనిపించుకోసాగాడు.

అప్పట్లోనే పెంటయ్యకి పెళ్ళయింది.

కొడుకు జీవితం చూసి తండ్రి గర్వపడ్డాడు.

కన్నుమూసేముందు లక్షోమాటు సలహా ఇచ్చాడు. 'ఒక్క తూరయినా సాకిరేవులో బంగసి ఇంట్లో పెళ్ళాన్నిబాదకు' అని.

కాని క్రమంగా పెంటయ్యకి యీబస్సు మీద జీవితం విసుగునీ, నీరసాన్నీ కలిగించింది. కండక్టరుకీ, దారికడ్డునిలిచే పశువులకీ కూడా దాసోహమ్మనాలి. వందలాది మందిని కొత్త చోట్లకి పంపిస్తాడు, ఇళ్ళకి రప్పిస్తాడు. కాని తన జీవితంలో మట్టుకు మార్పు, కొత్తదనం సున్నా.

ఎలా వాటిని సాధించాలో తెలియక తనమీద తనే ద్వేషంతో మండిపోతూ రాత్రిళ్ళు భార్యని చావమోదేవాడు.

అతనికో కొడుకు కూడా పుట్టాడు.

అప్పుడప్పుడు వాడికి తల్లి పాలిస్తూ ఉంటే ఇంటికివచ్చిన పెంటయ్య వాడిని లాగి కింద పడేసి, చింతరువ్వతో ఆ తల్లి రొమ్ములు చీరుకు పోయేలా కొడుతూ 'ఎదవనెందుకు పెంచుతావ్? ఈ ఎదవ పెద్దయి ఎలిగించేదేవుంది? బతకడం చేతగాక మరో ఆడమంటని ఉసురు పెట్టడమేగా? మా తాత, మా బాబు, నేను..... తరతరాలుగా ఇదే బరువు!' అంటూ నిస్పృహగా నులకమంచంమీద పడి ఆడదానిలా ఏడ్చేవాడు.

చచ్చిపోయేటప్పుడు ఆమె ఇలాటి ఘట్టాల్ని తలుచుకునే నాగరత్నంతో 'మీబావ మనసు. ఎన్నపూస సెల్లీ! ఎల్లా సూత్తావో అతన్ని బాగా సలుసునీ..... అని కళ్లనీళ్లు పెట్టుకుంది.

భార్య పోయిన తర్వాత అన్నీ వదులుకున్నాడు పెంటయ్య. ప్రకృతి విచారాన్ని ఎలాగా తొలగిస్తుంది. కాని అది చెప్పినట్టు వింటే మానవుడికిన్ని అవస్థలెందుకు?

పెంటయ్యలో పశ్చాత్తాపం ఎక్కువయిపోయింది. భార్యపోయిన దుఃఖం తను మరిచిపోతే మహాపాపం అవుతుందనుకున్నాడు. తాను తన భార్యకి తగనని నిరూపించుకోవాలనే అవ్యక్త వాంఛ అతనిలో బలమయింది.

రాత్రుళ్లు స్నేహితులతో కలిసి నేతిలో వేయించిన కోడిని తినడం, పేకాడడం మొదలయిన వ్యసనాల్లో చచ్చిపోయి, పగలు యంత్రాన్ని నడిపే మరగా బతుకుతున్నాడు.

నోరూ వావీలేని కొడుకుని కూడా అప్పుడప్పుడు చితక తన్నేవాడు. తాను అసహ్యంతో మోస్తున్న భయంకరమయిన కాగడాని మరో తరానికి కొనసాగించే పిశాచం వాడు.

నాగరత్నం వచ్చి ఈ పరిస్థితులని కొంచెం చక్కబరిచింది. కాని ఆమె అసలు తపన అలాగే ఉండిపోయింది. పెంటయ్యని మనిషిగా మార్చలేకపోతోంది,

'రొయ్య పులుసేవన్నా బాగుపడిందా ?' అంది — అది పస్తుగా ఉందని తనకి తెలిసి ఉండీ.

'వూఁ' అన్నాడు పెంటయ్య ముక్తసరిగా.

'ఆరంగడేవంటన్నాడో తెలుసా?'

'తెలీదు.'

'ఎంత సిగ్గులేనోడివి నువ్వు. నన్నెవరేవన్నా నీకు పట్టదన్నమాట?'

'నిన్నంటే నాకెందుకు సిగ్గు? ఇంతకీ ఏవన్నాడేవిటి?' అన్నాడు పెంటయ్య తినడం ఆపుకుండానే.

నాగరత్నం నోరుమూసుకు వూరుకుంది. దెబ్బతిన్న గుండె గొంతుకి అడ్డుగా పడింది. అదీగాక రంగడేమీ అనందే, బావతో చెప్పుకోడానికేముంది? వాడుచేసినపని చెప్పడానికేనా లజ్జ అడ్డు. కాని ఓమూల పిల్లడుపడ్డ బాధ నాగరత్నం హృదయాన్ని కెలుకుతోంది.

'ఎదవ! సుబ్బన్నని తీసుకొస్తావంటే రాసుకుపోయాడు. కురుపురేగి, పాపం, గిలగిల కొట్టుకున్నాడు' అంటూ పెంటయ్య ఎర్రని కళ్లలో కనీసం పితృప్రేమయినా కనబడుతుందేమోనని ఆశ వెతికింది నాగరత్నం.

'నీవంకచూస్తే చరమం వలిచి ఇస్త్రీ చేస్తానని చెప్పు.' అంటూ తనో గొప్ప చతురోక్తి విసిరినట్టుగా విరగబడి నవ్వసాగేడు పెంటయ్య.

తన అవమాన సమయంలో భర్తలు నిస్సహాయులనే వూరటయినా ఉంది ద్రౌపదికి. నాగరత్నానికదీ లేదు.

అయితే నాగరత్నం తనకెవరివల్లో పరాభవం జరుగుతోందని బాధపడడంలేదు. రంగడులాటి వాళ్లని లక్షమందిని చూసింది. మొరిగితే ఛీ అనేది. మీదపడబోతే కాళి అయేది.

అయితే మరి ఆమె పెంటయ్య దగ్గర తన బాధ ఎందుకు వెళ్లబోసుకున్నట్టు?

ఆడది మొగాడి సాయం కోరుతుంది — మొగాడి ప్రేమని అతను తనపట్ల చూపే శ్రద్ధ ద్వారా తెలుసుకోవాలనే తహతహవల్లో, తనని లక్ష్యపెట్టే మొగాణ్ణి ప్రదర్శించుకోడానికోగాని, అబల అయినందువల్లకాదు.

అంచేత ఇప్పుడు నాగరత్నం బాధల్లా తాను పెంటయ్య బావకి అక్కరలేకపోయాననే.

తాను! చామనచాయతో నిగనిగలాడే ఒళ్ళూ, వయసూ, సొగసూ, పుణికి పుచ్చుకున్న అవయవ సౌష్ఠవం! చూసిన ప్రతివాళ్ళూ తను చాకలాళ్ళ కొంపలో తప్పబుట్టాననడమే — అక్కడికి పైకులాలవాళ్ల అందం గుత్తగొన్నట్టు.

ఆఖరికి ఈనాటికి తన అందం తననే వెక్కిరిస్తోంది.

పెంటయ్య చెయ్యి కడుగుకుని బీడీ వెలిగించాడు.

నాగరత్నం కారియర్ నదిలో కడిగి గిన్నెలు అమర్చి బస్సులో పెట్టింది. రావివేరు తలగడ వేసుకుని పడుకున్న పెంటయ్యతో 'మరి వెళ్లొస్తా' అంది మూట ఎత్తుకుంటూ.

నదిదాటి పట్నంలో పనిచూసుకు సాయంకాలానికి ఈదరికొస్తుందామె.

అల్లంతదూరంలో నాగరత్నాన్ని చూసి 'బేగి రావాలి! గెంటేస్తన్నాం.' అని హుషారుగా కేకవేశాడు పడవవాడు.

మూటతో ఎక్కి కూర్చుంది.

పడవ పోతోంది.

పడవవాడు నాగరత్నంవైపు చూస్తూ తన కండలు ప్రదర్శిస్తున్నాడు.

ఆమె మాత్రం మిలమిల మెరిసే నీళ్లని చూస్తోంది. కాని వాటినీ చూడడంలేదు. ఆమె ధ్యానం ఎక్కడో ఉంది.

3 :

లేరేమన్నాడు సుబ్బన్న. అప్పుడే కాస్త కునుకు పట్టిన నాగరత్నానికి నిద్రాభంగమయింది. చిరాకుతో లేచికూర్చుని వాడి పిర్రమీద ఒక్కటి అంటించింది. అంతలోనే తడికె సందులోనుంచి బాగా తెల్లవారినట్టు కనిపించింది.

మంత్రం మాట జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆమెకి ఏడవలేక వెక్కుతున్న సుబ్బన్నమీద జాలి పొంగి పొర్లింది. గబుక్కున వాడిని రొమ్ముకి అదుముకుంటూ 'నిన్నే కొట్టానే వైరిమూండా! నాచేతులు పుడకల్లోబెట్ట.....!' అని కంట తడి పెట్టుకుంది — కేవలం తను కొట్టినందుకే కాదు, వాడి బాధ తనుకూడా మరిచిపోయినందుకు.

ఎప్పటికీ తగ్గకపోడంవల్ల కొంచెం అశ్రద్ధ బలిసి ఇవ్వాళ ఆలస్యంగా లేచింది నాగరత్నం. కాని ఆమెకి తగ్గుతుందనే ఆశపోలేదు.

లేచింది.

బస్సుదాటిపోయిందిగా.

దగ్గరతోవకదా అని తోటల్లోంచి బయలుదేరింది.

దట్టమయిన తోటల్లో కనిపించని బాల సూర్యుడు లేబచ్చికమీద అక్కడక్కడ కాంతిని పరిచాడు.

ఆ వెలుగునీడల్ని తదేకంగా చూస్తున్న సాధువు అనుకోకుండా తారసిల్లాడు నాగరత్నానికి.

'అబ్బ! ఆ వెలుగుల్లో దేవకన్యలు స్నానం చేసి వడుకున్నట్టు లేదా నాగరత్నం?' అన్నాడు భరించలేని ఆనందంతో అతని ముఖం ఆవేదనతో నిండిపోగా.

అయోమయంగా చూసింది నాగరత్నం. 'ఏంటి బాబూ, పొద్దున్నే కుటీరం వదిలి ఇలా వచ్చారు?' అంది.

సాధువు విచారంగా తల వంచుకున్నాడు. 'నా పావురాలు ఎక్కడికో ఎగిరిపోయాయి.'

ఆశ్చర్యపోయింది నాగరత్నం, 'దానికంత బెంగెందుకు బాబూ? ఎక్కడికి పోయినా అయి మళ్లీ తమదగ్గరకే సేరుతయి.'

'నిజంగా?!' అన్నాడు సాధువు పసివాడి ఉత్సాహంతో ఆశతో;

నాగరత్నానికి నవ్వొచ్చింది: 'ఎవరూ పట్టి కూలొండొయ్యకుండా ఉండాలి మరి!'

సాధువు వెర్రివాడిలా చూశాడామెవైపు. 'ఎంత అందంగా నవ్వుతావ్ నాగరత్నం నువ్వు!'' అని నిట్టూరుస్తూ ముందుకు సాగిపోయాడు.

అనాలోచికంగా వెంట వెడుతోంది నాగరత్నం. అప్పటికీ ఆమె గ్రహించలేదు— సాధువు బెంగ కేవలం పావురాలు ఎగిరిపోయి నందుకు కాదనీ, అతని గొంతే తనని చూడడంతో చెదిరిపోయిం దనీ.

'మంతరం ఎయ్యండి బాబూ.'

కాలవ వొడ్డున ఆమెవైపు వీపు ఉంచి నిలబడి ఉన్నాడు సాధువు. బంగారపు కాంతిలో తడు స్తున్న కొబ్బరిచెట్ల నీడలు అద్దంలాంటి కాలువలో కదలిక తమ సొగసుకి అబ్బురపడి పోతున్నాయి. చిన్నరాయి విసిరాడు సాధువు నీటిలోకి. పాముల్లా కదిలేయి నీడలు.

చప్పున వెనుదిరిగాడు సాధువు. 'లాభం లేదు నాగరత్నం! వాడి కాలు కుదిర్చేశక్తి నాలో లేదు. నువ్వే ఇవ్వాలి నాకాబలాన్ని' అన్నాడు ఆవేశంతో.

తెల్లబోయి అయోమయంగా చూసింది నాగరత్నం.

'రాత్రి ఆశ్రమంలో ఇంకెవ్వరూ ఉండకుండా చూస్తాను. నువ్వొరావూ ?' అంటూ అతి క్రూరంగా ప్రాధేయ పడ్డాడు.

నాగరత్నానికి అర్థమయింది. ఆఖరికి సన్యాసి కూడా తన అందానికి. . . ఆమె 'మామూలుగా పిల్లడిని తీసుకు తిరిగి వచ్చేసింది.

ఆవేళ సుబ్బారాయుడి షష్ఠి.

ఇంటికి వచ్చి పిల్లడిని తల్లికి ఒప్పగించి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి బయలు దేరింది. తీర్థంలో ముసలి జంటలు కూడా ఎంతో ఉత్సాహంగా ఉన్నాయి. నాగరత్నం అవేమీ చూడక దేవుడికి పళ్ళు ఇచ్చుకుని సుబ్బన్నని కాపా డమని దండం పెట్టి వచ్చేసింది.

గోచీకట్టుగా తొడలపైకి చీరకట్టి వగలబల్లా నీళ్లలో నిలబడి బట్టలు ఉతికింది.

నేలమీదబట్ట ఆరేస్తున్న ముసలిది కూతురి శ్రమ చూడ లేకపోయింది. 'ఏంటి అంత హొల్లెరక్కుండా సచ్చిపోతన్నావ్! కూంత నీడ పట్టున కూకో — తల్లో పేలన్నా సూద్దును గాని.' అంది చింపిరి తలని రెండుచేతులతో గోక్కుంటూ.

శరీర శ్రమలో ఏవో మరిచిపోదామన్న ఆశ కాబోలు, నాగరత్నం పని మానలేదు.

కనుచీకటివేళ, బానకింద కొబ్బరాకులు మంట పెడుతూ కూర్చున్నప్పుడు తెలిసి నొచ్చాయి నాగరత్నానికి వొళ్ళునొప్పులు.

అప్పటికీ ఆమె వాటిని లెక్కచెయ్యలేదు, వేరే ధ్యానలో ఉండి.

మంట వెలుగు నీడలు ఆమె ముఖం మీద పాముల్లా ఎగురుతున్నాయి.

'లేపోతే సుబ్బన్న గతేవవుద్దో!' అనే సందేహం ఆమెని పీడిస్తోంది.

కొంచెం దూరంగా ఇద్దరు చాకలి ఆడవాళ్ళు పోట్లాడు కుంటున్నారు. మరోయింటి లచ్చిని మొగుడు చుక్కమీద ఉండి బాదుతున్నాడు. గుడ్డలు ఉతికి ఇచ్చేసి డబ్బులు తేకుండా వొచ్చి నందుకు. చావకుండా చంపుతున్న లచ్చిమామ ఖంగున దగ్గుతున్నాడు.

'ఇలవలేని బతుకు లియి! ఈమూణ్ణాళ్లా శంకలతో కట్టుబాట్లతో సావడం ఎందుకు ?'

హఠాత్తుగా లేచింది నాగరత్నం ఏదో నిశ్చయానికి వచ్చిన దానిమల్లే. వేడినీళ్లు పోసుకుని ఇస్త్రీ చేసినచీర కట్టుకుంది. ముసలి దాని బలవంతం వల్ల కూడా తిందామని కూచున్న ఆమెకి నోటికి పోలేదు. కుక్కకి పడేసింది.

పూరు మాట మణిగాక ఆశ్రమం వైపు బయలుదేరింది తోటలో నుంచి.

'నాసంగతి తనకి పట్టకపోవడం వల్ల ఎలాటి నీతిసూలిన ముండనయిపోయానో పెంటయ్ బావకి తెలవాలి!' అనుకుంది నాగరత్నం.

ఆత్మవినాశంతోనయినా పరే పరులమీద కసి తీర్చుకోవాలనే ఇలాటి వాంఛలే స్త్రీ దేహా నికి అస్తిపంజరం.

అయితే నాగరత్నంలో ఇలాటి వాంఛ అత్య ల్పంగా ఉంది. కానా సుబ్బన్నమీదా, తనమీదా తనకే ఆమెలో పొంగిపోతున్న జాలే, ఆమెని ఆగాతోన పట్టించింది.

దూరంగా ఒకటి రెండు మెగళ్ళు కనబడు తున్నాయి. అవ్వైపు గాలిలో ఈదుతున్నట్టు ఒక దీపం పోతోంది— పెద్దకాలవమీద పడవమీదది అయుంటుంది. ఆకాశపు ఆకడని షష్ఠి చంద్రుడు మసక వెన్నెల చిమ్ముతున్నాడు.

అల్లంత దూరాన కాషాయరంగు పట్టు వస్త్రాలు — ఉద్దేశం చెప్పినా ప్రజల్ని పట్టుకు వేళ్లాడే ఆహారంలా — పచారుచేస్తున్న సాధువు హెంటిమీద మిలమిల మెరుస్తున్నాయి.

నాగరత్నాన్ని నెమ్మదిగా లోనికి తీసుకు పోయాడు ఆదరంతో సాధువు.

సెమ్మాలో నిలకడలేని దీపపుకాంతి గదిలో నటిస్తోంది.

సాధువు ముఖంపై అస్తమయ సూర్యుడి జాలిగొలిపే అపూర్వ తేజస్సు గోచరిస్తోంది. శృంగార సన్యాస భావాలు కలిసి వ్యక్తి ముఖం వెలిగి పోకమానదు. రాత్రిని వెక్కిరించే ఎల్ర టిదీపం ఏమిటి ? ధన, ఋణ విద్యుత్తుల కలయిక.

అగరొత్తుల ఘుమఘుమ, పక్కమీద పువ్వుల మెత్తదనం చీకటి; అహల్యని రాయిగా మార్చిన వాంఛ, వెచ్చదనం ఇవన్నీ నాగరత్నాన్ని అలుముకుని ఆమె జ్ఞానేంద్రియాలకి మత్తు మందుగా పనిచేశాయి. కాని ఆమె హృదయం మండిపోతూ ఉంది, ఈ సౌఖ్యంపై, తనపై అసహ్యంతో.

చుక్కలు నిశ్శబ్దంగా మెల్లగా, మహాత్ముని లౌకిక దేహం వెంట వెళ్లే ప్రజల్లా, పడమ టికి ప్రయాణిస్తున్నాయి.

కుటీరం బయట ఉన్న బండిపై కూర్చు న్నాడు సాధువు.

నాగరత్నం నెమ్మదిగా అతని వెనకకి వచ్చి నిలబడింది.

'బాబూ, రెండు మంతరాలకయినా ఆడికి తగ్గేలా సూడండి.' అంది.

సాధువు నిశ్చలంగా ఉన్నాడు.

దూరంగా వెలుగు రేఖ గీసుకుంటూ ఓ ముక్క రాలి పోయింది.

'బాబూ' అంది మళ్లీ.

లాభంలేదు నాగరత్నం! ఇహ నామంత్రం పట్టేవ్వదు.' అనగలిగాడు సాధువురుద్ధకంఠంతో

'ఆఁ!' అంటూ రాయై పోయింది నాగరత్నం.

ఎంతసేపలా బొమ్మలా నిలబడి పోయిందో!

'వెళ్ళు నాగరత్నం ఇంటి దగ్గర పిల్లడినివనాసే వాళ్ళున్నారో లేదో.'

అన్న సాధువుమాటలకి ఉలికి పడింది.

అతను ఏమీ జరగనట్టు నెమ్మదిగా కుటీరం లోకి పోతున్నాడు.

ఆక్షణాన, అనిర్వాచ్య ప్రదేశంలో,

ఒక వ్యథిత స్త్రీ హృదయం,

మానవత్వంలోనే నమ్మకం కోల్పోయిన సం గతి ఎవరికి తెలుసు ?—

సాధువు కన్నీరు చూడ గలిగిన చుక్కలకికూడా తెలియదే.

తోటల గుండా తుళాయించుకుని నడుస్తోంది నాగరత్నం.ఉండుండి కీచుకీచు ధ్వనులు వినబడు తున్నాయి. దూరంగా నీరు పెట్టిన మళ్ళలోని కప్పలు అదే పనిగా బెకబెకలాడుతున్నాయి..

ఎందుకో తలెత్తింది.

ఒళ్ళు జల్లుమంది.

రాత్రిరైలుకిటికీలో నుంచి చూస్తే కనిపించే నిప్పురవ్వలా పరుగెత్తుకొస్తోంది ఒక చిన్నవెలుగు.

మరోకప్పుడయితే ఆంజనేయ దండకం వొల్లించుకునేది నాగరత్నం.

కాని ఇప్పుడామెలో నిర్లిప్తత, బతుకుపై రోతనిండి ఉన్నాయి.

అడుగుల చప్పుడు వినిపించిన వెంటనే మనిషి ఆకారం కనిపించింది.

ఆవ్యక్తి తక్కున ఆగి నోట్లో బీడీ పారేస్తూ, 'నాగులూ, నువ్వేనేటి?' అన్నాడు.

ఆశ్చర్యపోయింది నాగరత్నం. ఆకాశం విరిగి పూడి పడ్డాడా పెంటయ్య? తలపొంచుకుంది.

పెంటయ్య ఆమె భుజాలు పట్టుకుని'నాగులా! ''వూరొదవలంతా నీ గురించి ఏంటేంటో కూస్తు న్నారు. ఏదన్నాఉపదేశంచెయ్యడానికి పిలిచారేమో'' అని నేనంటే ఎదవలొకటేనవ్వు. చెప్పు నాగులా! ఆ తొత్తుకొడుకులంతా అనుకునేది అబద్దమే కదూ ?' అన్నాడు ఉద్రేకంతో.

నాగరత్నం జేబులో బీడి వెతికి అతనినోటికి అందించింది. అగ్గిపుల్లగీసి బీడీ వెలిగించింది.

ఆ వెలుగులో, తన తాపీ, అతనికి కలిగించిన ఆశ చూసి కుంగి కుంగి పోయింది.

అగ్గిపుల్ల పారేసి అతని కాళ్ల దగ్గర కూలబడుతూ 'కాదు బావయ్యా వూరి వాళ్లంతాఎంతో మంచోళ్లు. నావే......' మరి మాట పెగలక ఏడ్చింది. పడకతప్పదనుకున్న మరణశిక్ష పడినప్పుడు అపరాధి చలించడు.

'సరే,' అంటూ బీడీ పారేసి నెమ్మదిగా ఆమెని దాటి వేగంగా ఆశ్రమం వైపు పోసాగాడు పెంటయ్య.

అతని చేతిలో మెరిసిన కత్తిని చూసి 'బావా' అని అరిచి పరిగెట్టింది నాగరత్నం.

అతన్ని అందుకుని చెయ్యి పట్టుకుంది.

'ఏంటి బావా! ఈ వెర్రికోపం? ఉరిసిచ్చపడి సావాల్నుందా?' అంది సూటిగా భయపెడుతూ. కొన్ని నిముషాల మునుపు ఇలాటి సందర్భం ఉటస్థించినట్లయితే ఆమె పెంటయ్యలో మానవత్వాన్ని మేలుకొలపడానికి ప్రయత్నించేది. కాని ఇప్పుడామెకి దానిలో నమ్మకంలేదు గదా.

'నన్ను చంపే హక్కు ఇంకో ఎదవకిస్తానా?' అంటూ నవ్వాడు పెంటయ్య. మృదువుగా నాగరత్నం పట్టు విడిపించుకుని పరిగెట్టాడు.

కొయ్యయి పోయింది నాగరత్నం. పెంటయ్య చెయ్యదలచినదేమో బోధపడింది. బావ తనకి దక్కడనే భావంతో ఆమె అతని మీద ఉన్న ప్రేమకి వరదలు వొచ్చాయి. కట్టలు తెంచుకునే దుఃఖాన్ని మింగి కేక వేసింది.

'ఆగు బావా! నీకక్కర్లేని దిక్కులేని ముండ ఎవత్తికో ఏదో అయితే నీకెందుకు రోసం ?'

ఈ సవాలుతో ముందుకుతూలేటంత హఠాత్తుగా ఆగాడు పెంటయ్య. నెమ్మదిగా వెనుదిరిగి వచ్చి కన్నీళ్లతో నుంచున్న నాగరత్నాన్ని దగ్గరకి తీసుకుంటూ 'నువ్వు నాకక్కర్లేదా, నాగులా ? ఎవరు చెప్పారు నీకు? పెళ్లాన్ని సుకపెట్టలేని ఎదవని!' తాగుడు నన్ను లోలోపల పురుగుల్లా తినేసిన ఎదవీనుగుని.....'అని వాపోయాడు.

అంత ప్రేమని భరించలేక పోతోంది. నాగరత్నం బావకి అసహ్యం కలిగేలా తనని తాను చూపించుకుంటేనేగాని ఆమెకి శాంతిలేక పోయింది.

'ఇప్పుడు నేను సుద్ద చెడిపోయినదాన్ని గద బావా!'.

'నా వెర్రి నాగులా!' అంటూ పట్టలేని ప్రేమతో, జాలితో ఆమెని ఛాతికి అదుముకున్నాడు. 'ఈ సంఘటన జరగక పోతే నీలోని ఆవేదనలేమిటో నాకేనాటికీ తెలియకపోయేవి గదా'? ఇటువంటిభావాలెన్నో చెప్పుకోవాలని ఉంది నాగరత్నంతో. కాని అతనికి మాటలు రావు.

అయితే అతని రొమ్ము వెచ్చదనమే నాగరత్నానికెంతో చెప్పింది.

భరించలేని వేదనతో రెండు జీవాలు పెనవేసుకు పోయాయి కొన్ని క్షణాలపాటు.

'అబ్బ!' అంది నాగరత్నం మెల్లిగా 'కత్తి గుచ్చుకుంది.' వెంటనే జ్ఞాపకం వొచ్చింది పెంటయ్యకి అది పట్టున్న సంగతి. ఈ సారి ఎవరు ఏ మాత్రం ... పరిగెత్తు సాగాడు.

నాగరత్నం వెంటబడింది.తన ప్రేమ సఫలం కావచ్చుననే ఆశ యిచ్చిన కొత్త బలంతో.

అలా పరిగెడుతూనే కేకలేస్తోంది.

'బావా ! . . .నాసంరచ్చనలో నువ్వు మళ్లీ మణిసివౌతావు ! . . . . నామాటిను.... అంత పనిసెయ్యమాకు !. . . .'

ఆమె అరుపులు అరణ్యరోదనమయాయి.

పెంటయ్య సాధువు కుటీరపు పొట్టి ద్వారంలోనుంచి లోపలకి దూరి పోయాడప్పుడే.

కెవ్వున కేక వేసింది. నాగరత్నం—సాధువో మరొకరో మేలుకుంటే కొన్నాళ్ల ఖైదు శిక్షతో మాత్రం పెంటయ్య బయట పడతాడని ఆమె ఆశ కాబోలు.

కాని ఆమె లోనికి వెళ్లి ఆశ్చర్యపోయింది.

ద్వారానికి అడ్డుగా నిశ్చేష్టుడై నిలబడిఉన్నాడు పెంటయ్య.!

అతని భుజం మీదనుంచి కనబడిన దృశ్యం ఆమెని మరింత అయోమయంలో పడేసింది.

చాపమీద వెల్లకిలా శవంలా పడి ఉన్నాడు. సాధువు.తల దగ్గర సెమ్మాలో దీపం శాంతి పొందిన ఆత్మలా నిలకడగా వెలుగుతోంది. ఎక్కడికో పోయాయనుకున్న జంటపావురాలిప్పుడు సాధువు పాదాల్ని జాలిగా పొడుస్తున్నాయి. భయంతో బయటికి ఒచ్చేశాడు పెంటయ్య. మానవత్వాన్ని మరిచిపోయాడేగాని చంపుకోలేదింకా అతను. నాగరత్నం చెయ్యిపుచ్చుకుని దొంగలా పారిపోతున్నాడు.

తన మామూలు హద్దు దగ్గర విచారంగా తోకాడిస్తూ తిరుగుతున్న కుక్క వీరిని చూసి మొరిగింది....

పిశాచాలు తరిమినట్లు, వెనక్కి చూడకుండా పరిగెట్టి ఇల్లు చేరుకున్నారిద్దరూ.

ఆశలెక్కువయినప్పుడే భయాలూ, పెరుగుతాయి. బన్నువొదిలి, నాగుల్నిచేపట్టి మనిషిగా బతుకుదామనే ఆశ ఒక ప్రక్క, ఏక్షణానసాధువుని తనే ఖూనీ చేశాడనే ఆరోపణతో తన తలపోతుందో ఆనే భయం ఇంకో పెంటయ్యకి ఆరాత్రల్లా నిప్పుల్లో ఉన్నట్లుంది.

ఆడదాని ముందు ఏడ్చేస్తున్నాడు.

ఉషోదయమవుతోంది.

గుడిసె ముందు 'అమ్మా' అన్న గంభీరమైన పిలుపు విన బడింది.

మృత్యువు పిలిచినప్పటి భయం పెంటయ్య కళ్లలో.

నాగరత్నం బయటికి వచ్చింది. తాను చూసిన ఆ ఆశ్రమవాసి స్వచ్ఛమైన ఉషస్సులా నిలబడి ఉన్నాడు వాకిట.

'పిల్లడిని తీసుకురా, మంత్రం వేస్తాను.'

నాగరత్నానికి వణుకు పుట్టింది.

'భయపడకమ్మా, మూడు మంత్రాలతో తగ్గిపోతుంది. ... గురువుగారు నాకు ఆజ్ఞాపించారు.' అన్నాడతను ... ... నాగరత్నం ... ... ... వచ్చింది.

అతను నామంత్రంవేసి 'మళ్లీ రేపొస్తానమ్మా గురువుగారి దేహం దహనం చెయ్యడానికి ఏర్పాటు చెయ్యాలి వెళ్లి.' అని చెప్పి అతను తాటి పట్టె మీదుగా కాలవదాటుతున్నాడు.

అంతా తెలిసినట్లు అతను మాట్లాడ్డంతో భయంవల్ల నాగరత్నం రక్తం గడ్డకట్టింది.

'బాబూ' అనికేక వేసింది.

కాలవ అవతల అతను వెనక్కి తిరిగాడు.

'ఇంత ధాత్తుగా—, అన బోయింది.

నాగరత్నం, కాని ఏమని అడుగుతుంది అంతా తనకే తెలిసినప్పుడు ?

'అవునమ్మా, ఆయన అంటూండేవారు., ''రక్తమాంసాలతో కూడిన శరీరం ఉన్నవాడిని నాలో ఏదైనా చెడు భావం కలిగితే ఆపని చేసేసి శరీరం చాలించేస్తాను.''అని. అకాలంలో వారు మమ్మల్ని విడిచి వెళ్లడానికి ఇలాటిదేదో కారణమయుంటుంది.' అని తోటల్లో కనుమరుగు అయాడతను.

నాగరత్నంలోనికి పరిగెట్టుకుని వొచ్చి పెంటయ్య గుండెల్లో ముఖం దూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది. ఒకమంచి మనిషి పోయి నందుకు దుఃఖం, బావదక్కినందుకుఆనందం అశ్రువుల్లో కలిసి కాలవలు కట్టాయి. ★


# హోం సినె ప్రొజెక్టర్

రు. 15/—



## ఇంటివద్ద అద్భుతమైన వినోదము

మీ స్వంత యింట్లో మా ప్రొజెక్టరులో సినిమాలోని సాహస కృత్యములు, ప్రేమ కలాపాలు మొదలైనవి చూచి ఆనందించండి. టార్చిలైటుగాని ఎసి డిసి ఎలెక్ట్రిసిటిగానివాడవచ్చును. ఫిలిం 35 ఎం. ఎం. బొమ్మలు స్క్రీన్ మీద కదులుతూ నాట్యం చేస్తు వినోదం కలిగిస్తాయి. ధర రు. 15లు40అ. ఫిలిం మరియు 4' X 3' సైజు స్క్రీను. ఫిలిం చూపించే విధం ఉచితం పోస్టేజి రు. 4—50 న. పై. అదనం. డీలక్సు స్పెషల్ ప్రొజెక్టర్ ధర రు. 25 లు 60 అ. ఫిలిం 4' X 3' సైజు స్క్రీను. ఫిలిం చూపించే విధం ఉచితం. పోస్టేజి రు. 5— అదనం గిరాకీ విశేషంగా ఉంది నేడే ఆర్డరు పంపండి.

**HOLLYWOOD CINEMA CORP. (Regd.),**

2194, Kalyanpura, Turkman Gate, (7)
DELHI-6.